క్లుప్తంగా

ఘనంగా అమ్మవారి ఒడ్డు పండగలు



సాగరంలో మోదమాంబ అమ్మవారిని దర్శించుకున్న రమణమ్మ

మాడుగుల రూరల్: గ్రామాల్లో అమ్మవార్ల ఒడ్డు పండగలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాగరంలో మోదమాంబ అమ్మవారికి గుమ్మాల కొండలరావు కుటుంబ సభ్యులు ఒడ్డు పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, ఎంపీటీసీ శ్రీనాథు సూర్యకాంతం, జగ్గారావు, నాయకులు పాము వెంకట్రావు, దేముళ్లు పాల్గొన్నారు. కె.జె.పురంలో మోదమాంబ ఆటో వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఘటాల ఊరేగింపుతో మోదమాంబ పండగ నిర్వహించారు.

గురుకులాలకు ఐదుగురు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో సర్పంచ్, ఉపాధ్యాయులు

మాకవరపాలెం: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఐదుగురు విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపికయ్యారు. పైడిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఐదో తరగతి ప్రవేశాలకు పరీక్షలు రాశారు. వీరిలో జ్ఞానతేజశ్రీ, డి.ప్రియవర్షిణి, కె.మహితేజ, పి.వరుణ్, శీరం సుమిత్ర పరవాడ మండలం తానాం, భీమిలి, అచ్యుతాపురం, యలమంచిలి, అనకాపల్లిలో గురుకుల పాఠశాలలకు ఎంపికయ్యారని ఉపాధ్యాయుడు కె.ఎస్.ఆర్.మూర్తి ఆదివారం తెలిపారు. ఒక్క పాఠశాల నుంచే ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను సర్పంచ్ రుత్తల జ్యోతి అభినందించారు. బాగా చదువుకుని గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



బాధితురాలికి నగదు అందజేస్తున్న వెలగా నారాయణరావు

నర్సీపట్నం: మున్సిపాలిటీ కళాసీ కాలనీకి చెందిన క్యాన్సర్ బాధితురాలు మారంపూడి సత్యవతికి వైద్య చికిత్స నిమిత్తం ఎన్నారై అసోసియేషన్ ప్రతినిధి వెలగా నారాయణరావు రూ.54 వేల సాయం చేశారు. బాధితురాలికి అండగా నిలవాలని దాతలను కోరారు. అదేవిధంగా ఆమెకు ప్రతి నెలా రూ.3 వేల చొప్పున అందజేసేందుకు అసోసియేషన్ సభ్యులు సుతాపల్లి శ్రీకాంత్, కొప్పర్తి కుమార్ హామీ ఇచ్చినట్లు నారాయణరావు తెలిపారు.

నల్లజెండాలతో వామపక్షాల నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లజెండాలతో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

నర్సీపట్నం: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా విశాఖపట్నం పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్ష నాయకులు స్థానిక అబిద్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లజెండాలతో నిరసన తెలిపారు. అమిత్ షా గోబ్యాక్ అంటూ చేసిన నినాదాలు మిన్నంటాయి. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.రామునాయుడు మాట్లాడుతూ ఏపీకి ఏ మొహం పెట్టుకోని వస్తున్నారని ప్రశ్నించారు. విభజన హామీల్లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు కె.వి.సూర్యప్రభ, కె.ప్రసన్న, ఎల్.వి.రమణ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601

సుదీర్ఘ కల... నెరవేరిన వేళ

- 80 ఏళ్ల తర్వాత కొరువాడ జగన్నాథపురం మట్టిరోడ్డుకు మోక్షం
- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో తారురోడ్డు నిర్మాణం



సాయిపురాయుడు గెడ్డపై నిర్మించిన వంతెన



నిర్మాణం పూర్తయిన తారురోడ్డు

కె.కోటపాడు: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో గ్రామీణ రోడ్ల రూపురేఖలు మారిపోతున్నాయి. దశాబ్దాలుగా మట్టిరోడ్లపైనే ప్రజలు పడుతున్న అష్టకష్టాలకు మోక్షం కలుగుతోంది. తాజాగా కొరువాడ జగన్నాథపురం–దాలివలస కెనాల్ మార్గం వరకు మట్టిరోడ్డును బీటీరోడ్డుగా నిర్మించడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రెండు గ్రామాల మధ్య మట్టిరోడ్డు పూర్తిగా రాళ్లు తేలి ఉండటంతో దాలివలస, కె.జె.పురం, గవరపాలెం, ఆర్.వై.అగ్రహారం, కొరువాడ గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొనేవారు. ఇదేమార్గం మధ్యలో ప్రమాదకరంగా సాయిపురాయుడు గెడ్డ ఉంది. వర్షాకాలంలో నీటి ఉధృతికి సమీప రైతుల పశువులు కొట్టుకుపోయి మృత్యువాత పడిన పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మట్టిరోడ్డుతోపాటు సాయిపురాయుడు గెడ్డ సమస్యకు పరిష్కారం చూపాలని ఆయా గ్రామాల ప్రజలతోపాటు చీపురపల్లి, యడ్ల, కన్నూరు, గుంపాన, ఆవాల కళ్లాల రైతులు 80 ఏళ్లుగా ప్రజా ప్రతినిధులను, అధికారులను వేడుకున్నా ఫలితం లేకపోయింది.

పరిశీలించిన ఏడాదిలోనే తారురోడ్డు, వంతెన నిర్మాణం.. కొరువాడ జగన్నాథపురం–దాలివలస కెనాల్ మార్గం మధ్యలో మట్టిరోడ్డు, సాయిపురాయుడు గెడ్డ పరిస్థితిని 2022 ఫిబ్రవరిలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు స్వయంగా పరిశీలించారు. మట్టిరోడ్డును తారురోడ్డుగా నిర్మిస్తానని అక్కడ ప్రజలకు మాటిచ్చారు. వెంటనే నెల రోజుల్లో రూ.1.10 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో 1,250 మీటర్ల మేర మట్టిరోడ్డును ఏడున్నర మీటర్లు వెడల్పుతో తారురోడ్డుగా నిర్మించారు. సాయిపురాయుడు గెడ్డపై 20 మీటర్ల పొడవున, ఏడున్నర మీటర్ల వెడల్పుతో వంతెన నిర్మాణంతో పాటు ఐదు చోట్ల మదుములు ఏర్పాటు చేశారు. ఈ పనులు ప్రారంభించి ఏడాదిలోగా పూర్తి చేయడంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తూ డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

మా కష్టాలు తీరాయి



మట్టిరోడ్డులో పంటలను ఇళ్లకు తరలించేందుకు ఇబ్బందులు పడేవాళ్లం. సమీపంలో సాయిపురాయుడు గెడ్డ వద్ద నీటి ప్రవాహ వేగం ఉండటం వల్ల పశువులు పలుమార్లు ప్రమాదాల బారిన పడ్డాయి. ఈ సమయాల్లో ఆర్థికంగా నష్టాలను చవి చూశాం. డిప్యూటీ సీఎం చొరవతో ప్రస్తుతం రోడ్డు, వంతెన పూర్తి కావడంతో మా కష్టాలు తీరాయి.

– యడ్ల రామయ్యమ్మ, మహిళా రైతు, కొరువాడ జగన్నాథపురం

డిప్యూటీ సీఎం బూడికి కృతజ్ఞతలు



సుదీర్ఘకాలంగా మా గ్రామానికి వచ్చిన ప్రజాప్రతినిధులను రోడ్డు, వంతెన నిర్మించాలని కోరాం. ఎవ్వరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లగా, నెల రోజులకే నిధుల మంజూరు చేశారు. ఏడాదిలోపే పనులు పూర్తయ్యాయి. గ్రామస్తుల తరఫున ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

– చీపురపల్లి గోవింద, కొరువాడ జగన్నాథపురం

నేటి నుంచి పాఠశాలల పునః ప్రారంభం

- విద్యా కానుక కిట్ల పంపిణీకి ఏర్పాట్లు



బుచ్చెయ్యపేటలో పాఠశాలకు చేర్చుతున్న పుస్తకాలు

బుచ్చెయ్యపేట/మాడుగుల రూరల్: మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లోని పాఠశాలలు సోమవారం తెరుచుకోనున్నాయి. ఈ నేపథ్యంలో తీవ్ర ఎండల దృష్ట్యా ప్రభుత్వ నిర్ణయం మేరకు ఈ నెల 18వ తేదీ వరకు ఒంటిపూట బడులు నిర్వహిస్తామని ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 7:30 నుంచి 11:30 గంటల వరకు పాఠశాలలు పని చేస్తాయని, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఈ సమయ వేళలను పాటించాలని ఆదేశించారు. విద్యా సంవత్సరం ఆరంభం రోజే విద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తామన్నారు. ఈ మేరకు ఉపాధ్యాయులు తగిన ఏర్పాట్లు చేపట్టారు. మండలానికి ఇప్పటికే 35,350 పాఠ్య పుస్తకాలు, 2,530 యూనిఫాం, 5,075 జతల బూట్లు, 3,668 బెల్టులతోపాటు ఇతర సామగ్రి చేరాయి. విద్యార్థులకు ఉదయం 8.30 గంటలకు రాగిజావ, 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల లోపు భోజనం పెట్టాలని మాడుగుల ఎంఈవో బి. దేముడమ్మ తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో తరగతులు నిర్వహిస్తామన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



చౌడువాడలో విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుందరరావు

కె.కోటపాడు: వేసవి విజ్ఞాన శిబిరంలో ఆటపాటలతోపాటు విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు అవసరమైన కథల పుస్తకాలు చదివించామని గ్రంథపాలకురాలు పద్మావతి తెలిపారు. చౌడువాడ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. క్రీడలు, వ్యాసరచన, వక్తృత్వ, యోగా పోటీల్లో ప్రతిభ చూపిన వారికి సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ బహుమతులు ప్రదానం చేశారు.

సమయాన్ని వృథా చేయొద్దు

మాకవరపాలెం: విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా లక్ష్య సాధనకు కృషి చేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుందరరావు సూచించారు. గ్రంథాలయంలో 45 రోజులుగా జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు ఎంతో ఆసక్తితో స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం, కథలు, గణితం, తదితర అంశాలపై శిక్షణ పొందడం అభినందనీయమన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులకు ఘన సత్కారం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి చంద్రకళ, గౌతమి లలితకళా శిక్షణా కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు, శేషగిరిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి పండగలు



రావికమతంలో అమ్మవారి ఘటాలు తీసుకెళ్తున్న భక్తులు

రావికమతం: కొత్తకోటలో మోదకొండమ్మ, రావికమతంలో సత్తెమ్మతల్లి పండగలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూ కట్టారు. పలువురు మహిళలు ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ శానాపతి అప్పారావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చోడవరం భక్తాంజనేయ స్వీట్ స్టాల్, స్థానిక భక్తులు సియాద్రి భాస్కరరావు, కంచుమూర్తి చిరంజీవిల ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

రాధాకృష్ణ ఆలయ వార్షికోత్సవం నేడు

కొత్తకోటలోని రాధాకృష్ణ ఆలయ వార్షికోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఆలయం వద్ద ఉదయం హోమాలు, మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

మోదమ్మతల్లికి...

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ వీధి పండుగ పసుపులేటి కుటుంబీకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతి రూపమైన 110 ఘటాలతో ఊరేగింపుగా చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రతి విద్యార్థిని ప్రోత్సహించాలి



దేవరాపల్లిలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ పెంటమ్మ



బహుమతులు పొందిన విద్యార్థులతో గ్రంథపాలకురాలు వరహమణి

దేవరాపల్లి: ప్రతీ విద్యార్థి సృజనాత్మకతను పెంచుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను ఎల్లేటి కరుణాకర్‌నాయుడుతో కలిసి ప్రదానం చేశారు. గ్రంథపాలకుడు ఓ. శ్రీనివాసరావు, వార్డు మెంబరు కాటపల్లి సృజన, పాఠకులు పాల్గొన్నారు.

రావికమతం: కొత్తకోట గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. రోజూ విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్స్, యోగా వంటి సృజనాత్మక కార్యక్రమాలపై తర్ఫీదు ఇచ్చారు. ఇందులో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు బేతా నూకరాజు బహుమతులను అందించారు. గ్రంథపాలకురాలు వరహమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వస్త్ర సంచులు పంపిణీ



వస్త్ర సంచులు ప్రదర్శిస్తున్న వృక్షమిత్ర వ్యవస్థాపకుడు అప్పన రాంబాబు మాస్టారు

రోలుగుంట: వస్త్ర సంచులను వినియోగించి పర్యావరణాన్ని రక్షించాలని వృక్షమిత్ర వ్యవస్థాపకుడు అప్పన రాంబాబు మాస్టారు కోరారు. వస్త్ర సంచుల మేలుపై కుసుర్లపూడిలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచుల వినియోగం వల్ల కలుగుతున్న నష్టాలతో వాటిని పూర్తిగా నిషేధించిందన్నారు. అనంతరం తన సొంత నిధులతో సమకూర్చిన 50 బ్యాగ్‌లను గ్రామస్తులకు పంపిణీ చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల పీఎంసీ చైర్మన్ గొల్లు రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

తారురోడ్డు పనులకు శంకుస్థాపన



కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ జయమ్మ

చీడికాడ: ఎట్టకేలకు అప్పలరాజుపురం–చీడికాడ తారురోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అప్పలరాజుపురంలో ఎంపీపీ కురచా జయమ్మ ఆదివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వాలు శిథిలమైన ఈ రోడ్డును కనీసం పట్టించుకోలేదన్నారు. 4.4 కిలోమీటర్ల మేర పొడవు కలిగిన ఈ రోడ్డు సమస్యను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకెళ్లడంతో రూ.1.40 కోట్లు కేటాయించారన్నారు. మండల వాసుల తరుపున ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నేతలు దారపు సత్యనారాయణ, శరగడం సూరిబాబు, చుక్కా వెంకటరమణ, గండి సత్యంనాయడు, సింగంపల్లి నాయుడుబాబు పాల్గొన్నారు.

దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట నేడు

దేవరాపల్లి: ఏ. కొత్తపల్లి పంచాయతీ శివారు చిప్పడపాలెంలో దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకలకు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు హాజరవుతారన్నారు.

సంక్షేమ పాలనకే మద్దతు పలకాలి

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గణేష్



భీమబోయినపాలెంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం: మండలంలో వరుసగా ఐదో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. ఇందులో భాగంగా భీమబోయినపాలెం పంచాయతీలో ఆదివారం నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఇంటింటికీ తిరిగారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల రూపంలో ఏ ఇంటికి ఎంతమేర లబ్ధి చేకూర్చిందో వివరించారు. వారి పేరున ముద్రించిన బ్రోచర్లను అందజేశారు. పథకాలు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి దళితవాడలో గెడ్డపై కల్వర్టు నిర్మాణంతోపాటు బోర్లు, విద్యుత్ స్తంభాలు వేయించాలని స్థానికులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమాన్ని ప్రజలంతా గమనించి ప్రభుత్వానికి మద్దతుగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు చిటికెల రమణ, బొడ్డు గోవిందరావు, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, భద్రాచలం, హరిబాబు, వ్రి పాత్రుడు, మాజీ సర్పంచ్ కూండ్రపు రమణమ్మ, ఎంపీ టీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడమే సీఎం జగన్ లక్ష్యం

కోల్డ్ స్టోరేజ్ శంకుస్థాపనలో ఎంపీపీ రామధర్మజ



కోల్డ్ స్టోరేజ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ రామధర్మజ తదితరులు

మాడుగుల: సన్న, చిన్న కారు రైతులను ఆదుకోవడమే సీఎం జగన్‌మోహన్ రెడ్డి ముందున్న లక్ష్యమని, దీనిలో భాగంగానే ఆర్బీకేలు, కోల్డ్ స్టోరేజ్ బిల్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారని ఎంపీపీ వేమవరపు రామధర్మజ అన్నారు. ఆదివారం స్థానిక మోదకొండమ్మ ఆలయం సమీపంలో వైఎస్సార్ క్రాంతి పథకం ద్వారా ఏర్పాటు కానున్న కోల్డ్ స్టోరేజ్ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీలోని 11 మండలాలతోపాటు స్థానిక రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషి ఫలితంగా కోల్డ్ స్టోరేజీ భవనాలకు రూ.90 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో రెండు కలెక్షన్ సెంటర్లు, నాలుగు కోల్డ్ స్టోరేజ్ కేంద్రాల నిర్మిస్తామన్నారు. ఏజెన్సీలో పండించే వాణిజ్య పంటలు పసుపు, పిప్పళ్లు, కాఫీ పంటలతోపాటు స్థానిక రైతులు పండించే కూరగాయలు, అపరాలు, పండ్లు, తక్కువ ధరకు నిల్వ చేసుకుని, వీటికి డిమాండ్ ఉన్నప్పుడు విక్రయించుకుని అధిక లాభాలు పొందడానికి కోల్డ్ స్టోరేజ్ దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, కాంట్రాక్టరు ప్రసాద్, ఎఫ్‌పీవో సీసీ ప్రసాద్, వార్డు మెంబరు వేమణ గణేష్, కుక్కర శ్రీధర్ పాల్గొన్నారు.

సండే మండింది

- ఉగ్రరూపం దాల్చిన ఎండ



బుచ్చెయ్యపేట రోడ్డులో ముఖానికి గుడ్డలు చుట్టుకుని వెళ్తున్న వాహనదారులు

బుచ్చెయ్యపేట: రోజురోజుకీ భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా నిప్పుల కుంపటి రాజేశాడు. ఎండ తీవ్రతకు 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. వాహనదారులు, ప్రయాణికులతోపాటు ఇళ్లలో ఉన్న వారు వడగాల్పులకు తీవ్ర అవస్థలు పడ్డారు. చిన్నారులు, వృద్ధులు విలవిలలాడారు. మంచినీళ్లు, చల్లని పదార్థాలు తాగుతూ సేద తీరారు. శుభ కార్యాలకు హాజరయ్యేవారు, అత్యవసర పనులపై బయటకు వెళ్లిన వారు నానా అవస్థలు పడ్డారు.

మాడుగుల రూరల్: వేసవి వడగాల్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మండుటెండలు, అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతలతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. రోహిణి కార్తె ముగిసిన తర్వాత ఆదివారం ఎండ తీవ్రత ఏమాత్రమూ తగ్గలేదు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు బయటకు రాలేకపోయారు. వడగాల్పులతోపాటు పలు గ్రామాల్లో అప్రకటిత విద్యుత్ కోతతోపాటు ఉక్కపోతకు గురయ్యారు.

రోడ్డు విస్తరణకు తుది నోటీసు

- జారీకి సిద్ధమవుతున్న మున్సిపల్ సిబ్బంది
- స్వచ్ఛందంగా ముందుకొచ్చిన కొంత మంది వ్యాపారులు



విస్తరించనున్న మెయిన్ రోడ్డు

నర్సీపట్నం: స్థానిక మెయిన్ రోడ్డు విస్తరణకు తుది నోటీసులు జారీ చేసేందుకు మున్సిపల్ అధికారులు సిద్ధమవుతున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఇదివరకే భవన యజమానులకు తాత్కాలిక నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. వీటి గడువు ముగిస్తుండడంతో రెండు రోజుల్లో తుది నోటీసులు జారీ చేయనున్నారు. రోడ్డు విస్తరణ బాధితులు 229 మంది ఉండగా, 163 మందికి నోటీసులు జారీ చేశారు. మిగిలినవారు ప్రభుత్వ, దేవదాయ, మున్సిపల్ స్థలాల ఆక్రమణలో ఉండటంతో వాటిని స్వాధీన పరుచుకునే చర్యలు చేపట్టారు. వీరికి కన్ఫర్మేషన్ నోటీసులు జారీ చేస్తున్నారు. తుది నోటీసు ఇచ్చిన వారం రోజుల్లో భవన యజమానులు మార్కింగ్ ఇచ్చిన మేరకు కట్టడాలను తొలగించుకోవాలి. లేని పక్షంలో మున్సిపల్ అధికారులు రంగంలోకి దిగి చర్యలు తీసుకుంటారు. 1.5 కిలోమీటర్ల మేర రోడ్ల విస్తరణను నాలుగు డివిజన్లుగా విభజించారు. ఆయా డివిజన్లలో కట్టడాలను తొలగించేందుకు అవసరమైన ట్రాక్టర్లు, జేసీబీలు, ఇతర సామగ్రి, మనుషులకు సంబంధించి ఈ నెల 19న ఓపెన్ టెండర్ నిర్వహించనున్నారు. రోడ్డు విస్తరణ ఇప్పటికే ఆలస్యమైనందున త్వరతగతిన రోడ్డు విస్తరణ చేపట్టేందుకు దూకుడు పెంచారు.

గత పాలకులు ప్రకటనలకే...

మెయిన్ రోడ్డు విస్తరణ గత పాలకుల ప్రకటనలు కార్యరూపం దాల్చలేదు. జిల్లాలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నర్సీపట్నం మున్సిపాలిటీలో మెయిన్ రోడ్డును వందడుగులకు విస్తరించేందుకు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సంకల్పించారు. ఈ అంశాన్ని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రూ.12 కోట్లు మంజూరు చేయించారు. ఆయనతో స్వయంగా శంకుస్థాపన చేయడంతో

ప్రజల్లో నమ్మకం ఏర్పడింది.



నోటీసు ఇచ్చిన వారంలో కట్టడాల తొలగింపు..

మెయిన్ రోడ్డు విస్తరణ బాధితులకు కన్ఫర్మేషన్ ఇచ్చిన వారం రోజుల్లో కట్టడాలు తొలగిస్తాం. వారికి నష్టపరిహారంగా టీడీఆర్ బాండ్లు అందజేస్తాం. తాత్కాలిక నోటీసు గడువు ముగియడంతో కన్ఫర్మేషన్ నోటీసులు ఇస్తున్నాం. కట్టడాలను తొలగించేందుకు ఈ నెల 19న టెండర్లు పిలిచాం. ఎమ్మెల్యే గణేష్ సూచనల మేరకు రోడ్డు విస్తరణ త్వరతగతిన చేపట్టేందుకు చర్యలు చేపట్టాం.

– కె.కనకారావు, మున్సిపల్ కమిషనర్

ఆటో యూనియన్ ర్యాలీ నేడు

రావికమతం: కొత్తకోట రహదారి విస్తరణ చేపట్టాలని కోరుతూ శ్రీశాంతి ఆటో యూనియన్ సభ్యులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు సోమవారం ఉదయం గ్రామంలో ర్యాలీ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి వినతి పత్రాన్ని పోలీసులకు ఆదివారం అందించారు. ఇక్కడ రహదారి ఇరువైపులా 40 అడుగుల మేర ఆక్రమణలు తొలగించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. కొంత మంది భవన యజమానులు, వ్యాపారులు ఆపివేయించడంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com